సాక్షి నాగర్‌కర్నూల్

ఆదివారం । 6 । ఆగస్టు । 2023



గాడిన పడుతున్న ఆర్టీసీ

ఆర్టీసీ సంస్థ గతంలో ఎన్నడూ లేని విధంగా లాభాల బాటలో పయనిస్తోంది.

వివరాలు 10లో ▸



అత్యాధునిక హంగులు

పాలమూరు రైల్వేస్టేషన్‌లో ఆధునిక హంగులు కల్పించే పనులు మొదలయ్యాయి.

వివరాలు 12లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.7 /21.6

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి వేళల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శనేశ్వరాలయానికి భక్తుల తాకిడి



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ శనేశ్వరాలయానికి శనివారం భక్తుల తాకిడి పెరిగింది. ఉదయం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని జేష్ఠాదేవి సమేత శనేశ్వరునికి తిలాతైలాభిషేక పూజలతోపాటు శివునికి అభిషేకాలు నిర్వహించారు. పూజల్లో ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వనాథశాస్త్రి, శాంతకుమార్, ఉమ్మయ్య, భక్తులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

కల్వకుర్తి: పట్టణంలోని బీసీ బాలికల గురుకుల కళాశాలలో అతిథి అధ్యాపకులుగా విధులు నిర్వహించడానికి అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ దమయంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, బోటనీ, ఫిజిక్స్ విభాగంలో పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పీజీ అర్హత కలిగి, 55శాతం మార్కులు సాధించి, గతంలో బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 7,8,9వ తేదీల్లో నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు సెల్ నం .7993456838 కు ఫోన్ చేయాలని తెలిపారు.

ఆకస్మిక తనిఖీ

తాడూరు: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీని శనివారం జిల్లా పరిషత్ సీఈఓ ఉష ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా లక్ష్యాన్ని చేరే విధంగా మొక్కలు నాటాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ గంగమోహన్, కార్యదర్శి పవన్‌కుమార్ ఉన్నారు.

9 టెండర్లు దాఖలు

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలోని 230 మద్యం దుకాణాలకు టెండర్లు దాఖలవుతున్నాయి. శనివారం ఉమ్మడి జిల్లాలో మొత్తం మూడు టెండర్లు రాగా.. ఇందులో మహబూబ్‌నగర్ పట్టణంలో ఒకటి, కోస్గి, కల్వకుర్తిలో ఒక్కో టెండర్ చొప్పున వచ్చాయి. ఈ మూడు టెండర్లతో కలిపి ఇప్పటి వరకు 230 దుకాణాలకు గాను 9 టెండర్లు దాఖలయ్యాయి. ఈ నెల 18 వరకు అవకాశం ఉన్న నేపథ్యంలో రెండు రోజుల తర్వాత దరఖాస్తులు పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు.

'తొలిమెట్టు'ను సమర్థవంతంగా అమలు చేయాలి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను మరింతగా పెంపొందించేందుకు తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సమర్థవంతంగా అమలు చేసి ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు గణిత సబ్జెక్టుపై తొలిమెట్టు శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1 నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయిని పెంపొందించేందుకు ఈ విద్యా సంవత్సరంలో తొలిమెట్టు కార్యక్రమాన్ని తరగతి గదిలో పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రతి ఉపాధ్యాయుడు ప్రణాళికలు రూపొందించి, పిల్లలను భాగ్యస్వామ్యం చేస్తూ విద్యా బోధన కొనసాగించాలన్నారు. ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఈ విద్యా సంవత్సరం కొత్తగా అందించిన వర్క్ బుక్ ల ద్వారా రీడింగ్, రైటింగ్ ఎబిలిటీలను పెంచాలన్నారు. శిక్షణల్లో సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ మురళీధర్ రెడ్డి, కోర్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్ల శెట్టి, ఆర్పీలు శ్రీనివాసచారి, సతీష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్నేహమే శాశ్వతం

- కష్టసుఖాల్లో తోడుండేవారే స్నేహితులు
- ఫ్రెండ్స్‌తో ఉంటే ఎంతో హ్యాపీ
- నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో 'సాక్షి' టాక్‌షో

సాక్షి, నాగర్‌కర్నూల్:



జీవితంలో ప్రతిఒక్కరికీ స్నేహితులే ముఖ్యమని, కష్టాలు, నష్టాల్లో తోడుంటే వారే నిజమైన స్నేహితులుగా యువత అభిప్రాయపడుతోంది. ఎప్పుడైనా కష్టం అనిపించినప్పుడు స్నేహితులతో మాత్రమే తమ బాధలను పంచుకోగలమని, వాళ్ల భరోసా ఇస్తే తమకెంతో ధీమాగా ఉంటుందని చెబుతున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో 'సాక్షి' శనివారం టాక్‌షో నిర్వహించింది. ఈ సందర్భంగా డిగ్రీ విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.



'సాక్షి' టాక్‌షో పాల్గొన్న నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

మన తప్పులు తెలియజెప్పేది ఫ్రెండ్సే..



మనం చేసే తప్పులను గుర్తించి, మనకు తెలియజేసేది ఫ్రెండ్స్ మాత్రమే. నిజమైన స్నేహితులు కష్టాల్లోనూ తోడుండాలి. జీవితాంతం స్నేహాన్ని కొనసాగించాలి. నా బెస్ట్ ఫ్రెండ్ ప్రియ. ఆమె నన్ను అన్ని విషయాల్లో ప్రోత్సహిస్తుంది. నాకు భరోసా కల్పిస్తూ ఎప్పుడూ అండగా ఉంటుంది.

– సంధ్య, బీకాం, ఫైనల్ ఇయర్

కష్టసుఖాలు వారితోనే..



నాకు చిన్నప్పటి నుంచి బెస్ట్ ఫ్రెండ్ శివరాణి. ఎప్పుడైనా గుడికి, బయటకు వెళ్లాలన్నా ఆమెతోనే వెళతాను. మంచి, చెడు, కష్టసుఖాలు ఏదైనా ఫ్రెండ్స్‌తోనే చెప్పుకుంటాం. ప్రతి విషయాలను ఫ్రెండ్స్ అందరం షేర్ చేసుకుంటాం. ఫ్రెండ్‌షిప్ లేని జీవితం చప్పగా సాగుతుంది.

– మంజుల, బీకాం, మొదటి సంవత్సరం

అర్థం చేసుకునేవాడే..



ఏ పరిస్థితుల్లో ఉన్నా మనల్ని అర్థం చేసుకునేవాడే నిజమైన ఫ్రెండ్. మనలో తప్పులుంటే సరిదిద్దుకునేలా చెప్పేది స్నేహితులే. క్లాస్‌మేట్‌గా ఉన్నప్పటి వరకే ఫ్రెండ్‌షిప్ పరిమితం కాకుండా జీవితాంతం కొనసాగాలి. భవిష్యత్తులోనూ ఒకరికి ఒకరు సాయం చేసుకునేలా ఎప్పుడూ కనెక్టెడ్‌గా ఉండాలి.

– సోయల్, బీకాం, మొదటి సంవత్సరం

అన్ని విషయాలు పంచుకుంటాం



మన జీవితంలో స్నేహితులతోనే అన్ని విషయాలను చెప్పుకోగలం. నా బెస్ట్ ఫ్రెండ్ చంద్రకళ. ఆమె హైదరాబాద్‌లో బీటెక్ చదువుతుంది. దూరంగా ఉన్నా తరచుగా మాట్లాడుకుంటాం. ఒకరికి ఒకరం అన్ని విషయాలను పంచుకుంటాం. ఫ్రెండ్స్‌తో ఉన్నప్పుడు ఆనందంగా ఉంటుంది.

– మాధవి, బీకాం, మొదటి సంవత్సరం

ఫ్రెండ్స్‌తో ఉంటే హ్యాపీ..



ఫ్రెండ్స్‌తో ఉన్నప్పుడు ఎంతో హ్యాపీగా ఉంటుంది. నా బెస్ట్ ఫ్రెండ్స్ అనురాధ, జ్యోతి, సునీత. వాళ్లతో అన్ని విషయాలను షేర్ చేసుకుంటా. తరచుగా కలుస్తుంటాం. కలుసుకునే సమయం లేకపోతే ఫోన్లోనైనా మాట్లాడుకుంటాం. ఏదైనా కష్టం అన్పించినప్పుడు ఫ్రెండ్‌తో చెప్తే కాస్త తేలిక అన్పిస్తుంది.

– అఖిల, బీఏ, మొదటి సంవత్సరం

ప్రతిరోజు 'ఫ్రెండ్‌షిప్ డే'నే..



బెస్ట్ ఫ్రెండ్ అంటే మనం తప్పు చేస్తే తప్పని, మంచి చేస్తే గుడ్ అని ప్రోత్సహించాలి. నా బెస్ట్ ఫ్రెండ్ మేథామ్స్. ఫ్రెండ్‌షిప్ అంటే కేవలం వాట్సప్ స్టేటస్‌లకే పరిమితం కాకుండా హెల్పింగ్ నేచర్ ఉండాలి. అలా ఉంటే ప్రతిరోజు 'ఫ్రెండ్‌షిప్ డే'లాగే ఉంటుంది.

– సోయబ్ అక్తర్, బీకాం, మొదటి సంవత్సరం

ఫ్రెండ్ లేకపోతే ఏం లేనట్టే..



ఎవరి జీవితంలోనైనా ఫ్రెండ్స్ ప్రభావం అధికంగా ఉంటుంది. వాళ్లు లేకపోతే ఏం లేనట్టే. నా బెస్ట్ ఫ్రెండ్ స్టాన్. నేను ఎక్కువగా ఫ్రెండ్స్‌తోనే గడుపుతా. తప్పు చేసినా మన వెన్నంటే ఉండేవాడే నిజమైన ఫ్రెండ్.

– శివ, బీఏ, మొదటి సంవత్సరం

జీవితంలో స్నేహం ముఖ్యమైంది

'ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహితులు ముఖ్యపాత్ర పోషిస్తారు. ఏ వయస్సులోనైనా స్నేహితులతో గడిపిన క్షణాలు ఆనందంగా ఉంటాయి. నా స్నేహితులు వివిధ హోదాల్లో ఎక్కడెక్కడో పనిచేస్తున్నా వారితో ప్రత్యేకంగా సమయం కేటాయించి మాట్లాడుకుంటాం. ఎప్పటికప్పుడు ఒకరి బాగోగుల గురించి ఒకరం చర్చించుకుంటాం. కష్టాల్లో, సుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉండేవాడే స్నేహితుడు. ప్రజలందరికీ ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు.'

– మనోహర్, ఎస్పీ, నాగర్‌కర్నూల్



కళాశాల నాటి మిత్రులు నరసింహారెడ్డి, వెంకటేశ్వరరెడ్డితో ఎస్పీ మనోహర్(కుడివైపు) →

అభివృద్ధి పనులు వేగవంతం



బావాయిపల్లిలో పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్

కోడేరు: మన ఊరు మన బడి పనులు వేగవంతం చేయాలని.. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు విధిగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. శనివారం మండలంలోని బావాయిపల్లి, తీగలపల్లి, కోడేరు, నాగులపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. పల్లె ప్రకృతి వనం, వైకుంఠ ధామం, క్రీడా ప్రాంగణం, ఆయా పాఠశాలలను పరిశీలించారు. అభివృద్ధి పనుల ప్రగతిపై కార్యదర్శులతో ఆరా తీశారు. బావాయిపల్లి పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో బోధన ఎలా కొనసాగుతుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కళ్లకలక బారిన గురుకుల విద్యార్థులు

ఐసోలేషన్‌లో ఉంచి వైద్య సేవలు



లింగాలలో ఐసోలేషన్‌లో ఉన్న గురుకుల విద్యార్థులు

లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు కళ్ల కలకతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి వరకు 40 మంది విద్యార్థులు దీని బారిన పడగా వారందరిని ప్రత్యేక గదిలో ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు. లింగాల సీహెచ్‌సీ వైద్యాధికారి శివశంకర్, పాఠశాలకు చెందిన వైద్య సిబ్బంది మురళి విద్యార్థులను పరీక్షించి మందులను ఇవ్వడమే గాక జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కళ్లకలక అంటు వ్యాధి అని, ఒకరి నుంచి మరొకరికి ఇట్టే సంక్రమిస్తోందని, కొన్ని రోజుల పాటు ప్రత్యేకంగా ఉండడమే మంచిదని వైద్యాధికారి తెలిపారు.

బిల్లు ఆమోదించాలని ఆర్టీసీ కార్మికుల నిరసన



జిల్లా కేంద్రంలో బస్‌డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

నాగర్‌కర్నూల్ క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని విలీనం చేసుకునేందుకు సిద్ధమై ముసాయిదా సిద్ధం చేస్తే బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడంపై ఆర్టీసీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని బస్‌డిపో ఎదుట ఉదయం 6గంటల నుంచి 8 గంటల వరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటిస్తు గవర్నర్‌కు పంపిన బిల్లును వెంటనే ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ శాసనసభ సమావేశాల్లోనే ప్రక్రియ పూర్తి జరిగే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇదిలాఉండగా, రెండు గంటల పాటు ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే ఉండిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలువురు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

సెకండ్ ఏఎన్‌ఎంల ధర్నా



జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

నాగర్‌కర్నూల్‌రూరల్: సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టర్ కార్యాలయ గేటు ఎదుట ఏఎన్‌ఎంలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ మాట్లాడారు. సెకండ్ ఏఎన్‌ఎంల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నపాగ శ్రీనివాసులు, నాయకులు పరీనా, హిమబిందు, యాదాబాయి, నిరంజనమ్మ, జ్యోతి, రామలింగమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు బొప్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట శనివారం సెకండ్ ఏఎన్‌ఎంలు ధర్నా నిర్వహించారు. బొప్పల్లి, తెలకపల్లి, పెద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కాంట్రాక్ట్ ఈసీ ఏఎన్‌ఎం, సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ధర్నా నిర్వహించారు. అనంతరం డాక్టర్ సంధ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సూర్యశంకర్ గౌడ్, వేణెపల్లి రవీందర్, దేశమోని ఆంజనేయులు, తపాల ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శంకర్, ఈసీ ఏఎన్‌ఎం, సెకండ్ ఏఎన్‌ఎంలు శ్రీదేవీ, రాధ, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

కొత్త కిక్కు..

- జిల్లాలో 67 మద్యం దుకాణాలు
- 22 దుకాణాలకు రిజర్వేషన్లు ఖరారు
- 18వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ.. 21న లక్కీ డ్రా
- రెండు రోజుల్లో రెండు దరఖాస్తులు

అచ్చంపేట: జిల్లాలో నూతన మద్యం పాలసీ టెండర్లు (2023) ప్రక్రియ మొదలైంది. ఈ నెల4న గెజిట్ ప్రకటన విడుదల కావడంతో దరఖాస్తుల హడావుడి ప్రారంభమైంది. మొదటి రోజు ఒక దరఖాస్తు రాగా.. రెండో రోజు ఒక దరఖాస్తు వచ్చింది. ఈ నెల 18వ తేదీ వరకు మద్యం దుకాణాలకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. జిల్లాలో మొత్తం 67మద్యం దుకాణాలు ఉండగా జనాభా ప్రతిపాదికన 22 షాపులకు రిజర్వేషన్లు ఖారారు చేస్తూ మార్గదర్శకాలు విడుదల చేశారు. సామాజిక వర్గాల వారీగా ఎస్టీలకు-4, ఎస్సీలకు-9, గౌడ్‌లకు-9 మద్యం దుకాణాలు రిజర్వేషన్లు ఖరారు కాగా 45 దుకాణాలు జనరల్ కేటగిరీగా పరిగణించారు.

❒ ఏజెన్సీ గిరిజన ప్రాంతాలైన అమ్రాబాద్, మన్ననూర్, పదర, బల్మూర్ దుకాణాలను గిరిజనులకు కేటాయించారు.

❒ ఎస్సీలకు నాగర్‌కర్నూలు మద్యం దుకాణం నంబర్ 01, 08 ,బిజినేపల్లి షాపు నంబర్ 1, కొల్లాపూర్ షాపు నంబరు 3, పెద్దకొత్తపల్లి మండలం కల్వకోలు, కోడేరు మండలం రాజాపూర్, వెల్దండ, ఊర్కొండ, అచ్చంపేట షాపు నంబర్ 4 మొత్తం తొమ్మిది మద్యం దుకాణాలను లక్కీ డిప్ ద్వారా కేటాంచారు.

❒ గౌడ కులస్తులకు బిజినేపల్లి షాపు నంబర్ 3. తిమ్మాజీపేట షాపు 2, పెద్దకొత్తపల్లి మండలం యాపట్ల, ఉప్పునుంతల మండల కేంద్రంతో పాటు, ఇదే మండలంలోని వెల్టూరు, కల్వకుర్తి షాపు నంబర్ 2, 3, 5, అమ్రాబాద్ మండలం దోమలపెంట 9దుకాణాలు లక్కీ డిప్ ద్వారా పొందారు. ఈనెల 20వ తేదీన లక్కీడిప్ ద్వారా మద్యం దుకాణాలను కేటాయిస్తారు.

ఎన్ని దరఖాస్తులైనా దాఖలు చేసే అవకాశం

2023–25 మద్యం పాలసీకి సంబంధించి ఆశావాహులు తమకు నచ్చిన ప్రాంతాల్లో ఒకే షాపునకు ఎన్ని దరఖాస్తులైన దాఖలు చేసుకోవచ్చు. అలాగే వేరే షాపులకు టెండర్లు వేసి ఎన్ని లైసెన్స్‌లైనా పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో వ్యాపారులు ఈసారి అధిక సంఖ్యలో దరఖాస్తు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతి దరఖాస్తుకి గతంలో మాదిరిగా రూ.2లక్షల డీడీ తప్పనిసరిగా జత చేయాలి. ఇవీ తిరిగి వెనక్కి ఇవ్వరు.

గతంలో జిల్లా ఆదాయం ఇలా..

జిల్లాలో మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు ఆశావహులు భారీగా పోటీ పడ్డారు. ఐదు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో దుకాణాలకు టెండర్లు దాఖలు పరిశీలిస్తే.. మద్యం పాలసీ ప్రకటన వచ్చిన ప్రతిసారీ దరఖాస్తుల సంఖ్య పెరుగుతూ పోతుంది. 2017లో 45 దుకాణాలకు 1,000 దరఖాస్తుల ద్వారా రూ.10కోట్లు, 2019లో 45 దుకాణాలకు 1,064 దరఖాస్తులు రాగా రూ.21.28కోట్ల ఆదాయం వచ్చింది. 2021లో 67దుకాణాలకు 1,507 దరఖాస్తుల వల్ల రూ.30.14కోట్ల ఆదాయం సమకూరింది.



దరఖాస్తు చేసే విధానం..

జిల్లాలోని మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఈ నెల18వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు ఉంది. కలెక్టర్ కార్యాలయంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణకు సర్కిల్‌కు ఒకటి చొప్పున ఐదు కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారులు డీడీలు లేదా చలాన్లు DPEO Nagarkarnool పేరు మీద తీసి కార్యాలయంలో అందించాల్సి ఉంటుంది. దరఖాస్తుతో పాటు ఆధార్, పాన్ జిరాక్స్ ప్రతులు, రిజర్వేషన్ షాపుల కోసం దరఖాస్తు చేసుకునే వారు కులధ్రువీకరణ పత్రాలు, ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వారు ఏజెన్సీ సర్టిఫికెట్, మూడు పాస్‌పోర్టుసైజు ఫొటోలు జత చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న వారికే లక్కీడ్రాలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఎంట్రీ పాస్ ఇచ్చి లోపలికి అనుమతిస్తారు.

ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశాం

దరఖాస్తుల స్వీకరణకు ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఈ నెల18వ తేదీ వరకు దరఖాస్తు గడువు ఉంది. ఏవైనా సందేహాలుంటే హెల్ప్ డెస్క్ నెం. 9440410004 పరమేశ్వర్‌గౌడ్, సీఐని సంప్రదించవచ్చు. ఈ నెల21న కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో కలెక్టర్ చేతుల మీదుగా లక్కీడ్రా తీస్తాం. షాపు దక్కించుకున్న వారు 1/6 వంతు చెల్లించాల్సి ఉంటుంది. ఒకరు ఎన్ని దరఖాస్తులైన చేసుకోవచ్చు.

– షేక్ ఫయాజుద్దీన్
జిల్లా ఎక్సైజ్ అధికారి(డీపీఈఓ)

ఆశావాహుల పోటాపోటీ

ఈసారి దాదాపు 2వేల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆయా రాజకీయ పార్టీల నాయకులతో పాటు మరి కొంతమంది టెండర్లు దక్కించుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నట్లు సమాచారం. దీంతో ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. లక్కీడ్రాలో షాపులు దక్కించుకున్న ఆరు ఆదేరోజు రెండు నెలలకు సంబంధించిన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రెండు సంవత్సరాల పాటు దుకాణం నడిపేందుకు అవకాశం కల్పిస్తారు. రెండేళ్లలో 12సార్లు, రెండు నెలకోసారి ఎక్సైజ్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. సేల్స్ పరంగా ఆరు రెట్లకు 20శాతం, 7 రెట్ల అమ్మకాలు దాటితే 10శాతం మార్జిన్ ఇస్తారు. షాపులకు సంబంధించి మూడు స్లాబ్‌లుగా విభజించారు. రూ.65లక్షలు స్లాబ్, రూ.55లక్షల స్లాబ్, రూ.50లక్షల స్లాబ్‌లో దుకాణాల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

24 గంటల్లో 44 కాన్పులు

పాలమూరు: మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 24 గంటల్లో 44 కాన్పులు జరిగినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకిషన్ తెలిపారు. ఉమ్మడి జిల్లాతోపాటు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల నుంచి ప్రసవాల కోసం ఆస్పత్రికి వచ్చారన్నారు. కాన్పు అయిన 44 నవజాత శిశువుల్లో 25 మంది మగ శిశువులు ఉంటే 19 మంది ఆడశిశువులు ఉన్నట్లు వెల్లడించారు. అదేవిధంగా 44 ప్రసవాల్లో సాధారణ కాన్పులు 23 ఉంటే మరో 22 ఆపరేషన్స్ అయినట్లు తెలిపారు. వీరిలో ఆరోగ్యం సక్రమంగా లేని నవజాత శిశువులను ఎస్ఎన్‌సీయూలో అడ్మిట్ చేయడం జరిగిందన్నారు. అనంతరం గైనిక్ వైద్యులను సూపరింటెండెంట్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గైనిక్ హెచ్ ఓడీ డాక్టర్ రాధ, వైద్యులు లక్ష్మీపద్మప్రియ, సరిత, స్వాతి, సింధూర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గేదెల కోసం చెరువులోకి వెళ్లి వ్యక్తి మృతి


రాములు (ఫైల్)

కొత్తకోట రూరల్: చెరువులోకి వెళ్లిన గేదెలను బయటకు రప్పించేందుకు ప్రయత్నించిన వ్యక్తి చెరులోని బురదలో ఇరుక్కుపోయి మృతి చెందిన ఘటన మండలంలోని రామకృష్ణాపురంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణాపురం చెందిన రాములు(57) తన వద్ద ఉన్న రెండు గేదెలు గ్రామ సమీపంలో చెరువులోకి వెళ్లాయి. వాటిని ఇంటికి తీసుకొచ్చేందుకు శుక్రవారం సాయంత్రం చెరువు దగ్గరకు వెళ్లి చెరువులోకి దూకాడు. చెరువులో దూకిన రాములుయాదవ్ బురదలో ఇరుక్కున్నాడు. స్థానికులు గమనించి చెరువులోకి వెళ్లి బయటకు తీశారు. అప్పటికే ఆయన మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు మొగులన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నేచర్‌గైడ్ దుర్మరణం


విజయ్‌కుమార్(ఫైల్)

అమ్రాబాద్: రోడ్డు ప్రమాదంలో ఫారెస్ట్ నేచర్ గైడ్ దుర్మరణం చెందిన ఘటన శనివారం పదర మండలం చిట్లంకుంట సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా.. పదర మండలం పెట్రాల్‌చేన్‌పెంటకు చెందిన మండ్లి విజయ్‌కుమార్(21) శనివారం తెల్లవారుజామున తన బైక్‌పై పదరకు బయలుదేరాడు. చిట్లంకుంట సమీపంలో రోడ్డు పక్కన బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని అమ్రాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తిరుపతి రెడ్డి తెలిపారు. ఆదివాసిచెంచు కుటుంబానికి చెందిన పెద్దులు, అంజమ్మ దంపతులకు నలుగురు కుమారులు. చేతికందిన పెద్ద కుమారుడు తమకు తోడు ఉంటాడనుకుంటే ప్రమాదంలో మృతి చెందడంతో వారి రోదనలు మిన్నంటాయి.

చెరువులో పడి ట్రాన్స్‌కో ఉద్యోగి..

గోపాల్‌పేట: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన రేవల్లి మండలంలోని గొల్లపల్లిలో చోటుచేసుకుంది. రేవల్లి ఏఎస్ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెన్నారం చెందిన గోపాల శివలింగం (38) తన భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులతో కలిసి హైదరాబాద్‌లో అంబర్‌పేటలో విద్యుత్ శాఖలో గ్రేడ్–4 ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. కొంతకాలం మతిస్థిమితం లేకుండా ఉంటున్నాడు. 2వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం గొల్లపల్లి సమీపంలోని మొగుళ్ల చెరువుకట్టపై పర్సు, చెప్పులు కనిపించడంతో వాటిని పరిశీలించిన స్థానికులు అందులో ఉన్న ఫోన్‌నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు చెరువు వద్దకు చేరుకుని వెతకగా ఆచూకీ కనిపించలేదు. 11గంటల ప్రాంతంలో చెరువులో మృతదేహం పైకి తేలింది. బయటకు తీసి చూడగా శివలింగంగా కుటుంబ సభ్యులు గుర్తించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు కూలీ..



అమరచింత: వ్యవసాయ పనుల కూలీ కోసం వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నందిమళ్లలో శనివారం చోటు చేసుకుంది. నందిమళ్లకు చెందిన మునిస్వామి(35) అదే గ్రామానికి చెందిన రంగన్న వ్యవసాయ పొలానికి వరి పంటకు యూరియా చల్లడానికి వెళ్లాడు. పొలం యజమాని వ్యవసాయ బోరుమోటార్ బంద్ చేయడమని చెప్పడంతో బావిలోకి దిగి మోటార్‌ను బంద్ చేసే క్రమంలో షాక్‌కు గురై అక్కడే మృతి చెందాడు. బావిలోకి దిగిన వ్యక్తి ఎంతకు రాలేకపోవడంతో యజమాని రంగన్న బావి వద్దకు వెళ్లి చూడగా, మోటార్‌పై విగతజీవిలా పడి ఉన్నాడు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బాలాజీ ఆలయంలో చోరీ

కోస్గి: గుండుమాల్ మండలంలోని బాలాజీ ఆలయంలో చోరి అయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామ శివారులోని దేవర్ బాలాజీ ఆలయంలో ఎప్పటిలాగే పూజారి కార్తీక్ శుక్రవారం పూజలు చేసి తాళం వేసి వెళ్లాడు. శనివారం ఉదయం ఆలయానికి వెళ్లగా, ఉత్తర గేట్ తాళం విరగగొట్టినట్లు గుర్తించాడు. హుండీని పగలగొట్టి అందులో ఉన్న నగదు ఎత్తుకెళ్లారు. విషయం గ్రామస్తులుకు తెలిపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గాడిన పడుతున్న ఆర్టీసీ

- త్రైమాసికంలో రీజియన్‌కు మెరుగైన ఫలితాలు
- లాభాల్లోకి వచ్చిన ఏడు డిపోలు
- మూడు నెలల్లో రూ.3.36 కోట్ల లాభం
- రాయితీలతో ఆక్యుపెన్సీ పెంచుకుంటున్న ఆర్టీసీ


మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ సంస్థ గతంలో ఎన్నడూ లేని విధంగా గాడిన పడుతుంది. సంస్థ ఆధ్వర్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం పలు రాయితీలు ప్రవేశపెడుతుండడంతో అనతికాలంలోనే మంచి ఆదాయాన్ని పొందుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు (త్రైమాసికం) మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ మెరుగైన ఫలితాలు సాధించింది. మహబూబ్‌నగర్ డిపో నష్టాలను అధిగమించి లాభాల్లో రావడంపై రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. గతేడాది మార్చి వరకు రూ.22 కోట్ల నష్టాల్లో ఉన్న డిపో ఈ ఏడాది మార్చి వరకు నష్టాలను అధిగమించి రూ.2 కోట్లు లాభాలు వచ్చాయి.

త్రైమాసికంలో ఏడు డిపోలు లాభాలు..

మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌లోని పది డిపోల్లో మహబూబ్‌నగర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి, అచ్చంపేట, నారాయణపేట డిపోలు లాభాల్లోకి వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు (త్రైమాసికం) మహబూబ్‌నగర్ రీజియన్‌కు దాదాపు రూ.3.36కోట్లు లాభం రావడం విశేషం. ఈపీకేలో వనపర్తి డిపో 436, మహబూబ్‌నగర్ డిపో 411, అచ్చంపేట డిపో 342లు సాధించాయి.

వంద రోజుల ప్రణాళిక విజయవంతం..

ఆర్టీసీ ఆదాయాన్ని పెంచడం కోసం గతేడాది నుంచి వంద రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 23వ తేదీ నుంచి జూన్ 30 వరకు వంద రోజుల ప్రణాళిక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి స్టాప్ వద్ద కనీసం ముగ్గురు నుంచి నలుగురు అదనంగా ప్రయాణికులను ఎక్కించుకున్నారు. దీంతో వంద రోజుల ప్రణాళిక ఆర్టీసీ మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు మంచి ఆదాయాన్ని సమకూర్చింది. డిపోల్లో ఈపీకే, ఆదాయంలో మంచి ప్రతిభ కనబరుస్తున్న డ్రైవర్, కండక్టర్, మెకానిక్ సిబ్బందిని ప్రతి నెల అభినందన సభ ఏర్పాటు చేస్తున్నారు. ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసి నగద బహుమతి, సర్టిఫికెట్లు అందజేస్తున్నారు.

రీజియన్‌లో లాభాల్లోకి వచ్చిన డిపోలు

డిపో	(ఆదాయం రూ.లలో)
మహబూబ్‌నగర్	1,76,68,000
వనపర్తి	1,66,33,000
అచ్చంపేట	1,00,82,000
కొల్లాపూర్	30,94,000
నారాయణపేట	11,35,000
గద్వాల	2,00,000
నాగర్‌కర్నూల్	1,12,000


ఉద్యోగుల సమష్టి కృషితో లాభాల్లోకి..



ఉద్యోగుల సమష్టి కృషితో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు రీజియన్‌లో ఏడు డిపోలు లాభాల్లోకి రావడం సంతోషంగా ఉంది. ఆర్టీసీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఉద్యోగులకు లక్ష్యాన్ని ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేస్తున్నాం. ఆర్టీసీని లాభాల్లోకి తీసుకురావాలనే తపన ఉద్యోగుల్లో కనిపించింది. దీంతో రీజియన్‌కు మంచి ఫలితాలు వస్తున్నాయి. ఉత్తమ సేవలు అందిస్తున్న ఉద్యోగులకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తూ ప్రోత్సహిస్తున్నాం. వంద రోజుల ప్రణాళిక, ప్రత్యేక ఛాలెంజ్‌లు డిపోలు లాభాల్లోకి రావడానికి తోడ్పడ్డాయి.

– శ్రీదేవి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, మహబూబ్‌నగర్

జూరాల గేట్ల మూసివేత


మూసి ఉంచిన జూరాల ప్రాజెక్టు గేట్లు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గడంతో గేట్లను మూసేసినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 6 గంటలకు 30వేల క్యూసెక్కులకు తగ్గిపోయాయి. దీంతో తెరిచి ఉంచిన 3 క్రస్టు గేట్లను మూశారు. ఆ తర్వాత 7గంటలకు స్వల్పంగా పెరిగి 41,090 క్యూసెక్కులకు చేరింది. సాయంత్రం 3గంటలకు 40వేల క్యూసెక్కులు ఉండగా, రాత్రి 8 గంటలకు 40వేల క్యూస్కెల ఇన్‌ఫ్లో కొనసాగింది. ఆవిరిరూపంలో 89, నెట్టెంపాడు రెండు పంపుల ద్వారా 1,500, భీమా లిఫ్టు–1కు 650, భీమా లిఫ్టు–2కు 750, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వ ద్వారా 730, సమాంతర కాల్వకు 800 దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.817 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో శనివారం 12 యూనిట్లకు గాను, 11 యూనిట్ల ద్వారా 433 మెగావాట్లు విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 42.710 ఎం.యూ., దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 43.550 ఎం.యూ. విద్యుదుత్పత్తిని చేపట్టారు. ఇప్పటివరకు 86.260 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని, 36,251 క్యూసెక్కులను వినియోగించినట్లు తెలిపారు.

కోయిల్‌సాగర్‌లో అలుగు స్థాయికి..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో శనివారం సాయంత్రం నీటిమట్టం అలుగు స్థాయికి చేరింది. అలుగు స్థాయి 26.6 అడుగులు కాగా ప్రస్తుతం 26.8 అడుగులకు చేరింది. గేట్ల స్థాయి వరకు 32.6 అడుగులుగా ఉండగా మరో 5.10 అడుగుల నీరు చేరితే గేట్లను తెరిచే అవకాశం ఉంది. ప్రస్తుతం జూరాల నుంచి ఎత్తిపోతల ద్వారా ఉంద్యాల పంపుహౌజ్‌లో ఒక మోటార్‌ను రన్ చేసి 315 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నారు. అలాగే పెద్దవాగు ప్రవాహం కూడ ప్రాజెక్టులోకి చేరుతుంది. దీంతో రోజుకు కొంత నీటి మట్టం పెరుగుతుంది. ప్రస్తుతం వానాకాలం పంటల సాగుకు కుడి, ఎడమ కాలువ ద్వారా 240 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయం నుంచి శనివారం 1,788 క్యూసెక్కుల నీటిని వినియోగించారు. పూర్తి స్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 730, సమాంతర కాల్వ ద్వారా 750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 900, కుడి, ఎడమ కాల్వ ద్వారా 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేజ్–2 ద్వారా 848 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

శ్రీశైలంలో 860.2 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం 860.2 అడుగుల నీటిమట్టం, 106.4 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాయంత్రం 6గంటల సమయంలో జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,302 క్యూసెక్కుల నీటిని దిగువున శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో భూగర్భ కేంద్రంలో 5.93 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 11,771 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు.

యజమానిని కాపాడిన పెంపుడు కుక్క

- బంగారు గొలుసు చోరీకి యత్నించిన దొంగ
- దొంగను వెంబడించిన కుక్క

గద్వాల క్రైం: ఇంటిల్లిపాది వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి బంగారు గొలుసు అపహరించేందుకు ప్రయత్నించగా, ఇంట్లో ఉన్న వృద్ధురాలు కేకలు వేయడంతో ఆమె నోరు మూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఇంట్లో ఉన్న పెంపుడు కుక్క నిందితుడిపైకి దూకి తన యాజమానిని రక్షించే ప్రయత్నం చేస్తూనే దొంగ వెంట పరుగులు తీసింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని నల్లకుంట కాలనీకి చెందిన సుజాతమ్మ కుటుంబ సభ్యులతో కలిసి ఉంటుంది. వివిధ పనుల నిమిత్తం కుమారుడు రామకృష్ణతో పాటు కుటుంబ సభ్యులు శనివారం ఉదయం బయటకు వెళ్లారు. 12 గంటలకు మొదటి అంతస్తులో ఉంటున్న ఆమె వంట చేసేందుకు గదిలోకి వెళ్లింది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి ఆమె ముఖానికి క్షణాల్లో ముసుగు వేశాడు. కేకలు వేయకుండా నోరును గట్టిగా అదిమి పట్టాడు. మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించే ప్రయత్నం చేయడంతో ఇంట్లో ఉన్న పెంపుడు కుక్క గమనించి వెంటనే దొంగపైకి దూకింది. నిందితుడిని ఇంట్లో నుంచి బయటకు పంపేందుకు కుక్క వెంబడించగా.. అతను వంట గదికి బయట నుంచి లాక్ వేసి పరారయ్యాడు. ఆమె తేరుకుని తన కుమారుడికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఇంటికి చేరుకుని వంట గది లాక్ తెరవడంతో బయటపడ్డారు. కాలనీలో పట్టపగలే చోరీ ప్రయత్నం, దాడికి పాల్పడడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు పట్టణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ విచారణ చేపట్టారు. కాలనీ, పట్టణ ముఖ్య కూడలీలో సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా అనుమానితుల కదలికలపై నిఘా ఉంచారు. త్వరలో దొంగని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన రహదారైన రాజీవ్‌మార్గ్ రోడ్డు మార్గంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం పట్టణంలో కలవరంగా మారింది. మరోవైపు నిర్మానుష్య కాలనీల పరిస్థితి ఎలా ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గుడ్లుపెట్టిన 'జెర్రిపోతు'

- పది గుడ్లను ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీకి అందజేత


కళాశాలలో భద్రపరిచిన జెర్రిపోతు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భద్రపర్చిన ఆడ జెర్రిపోతు పాము శుక్రవారం పది గుడ్లను పెట్టిందని వృక్షశాస్త్ర అధ్యాపకుడు డా.సదాశివయ్య శనివారం విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ.. సాధారణంగా కొన్ని పాములు గుడ్లను పెడతాయి. మరికొన్ని ప్రత్యక్షంగా పిల్లలను కంటాయి. అయితే ప్రజలు జెర్రిపోతును మగదిగాను నాగుపామును ఆడదిగాను అపోహపడుతుంటారన్నారు. కానీ జెర్రిపోతు పాముల్లో ఆడ, మగ ఉంటాయని తెలియజేశారు. ఐదు రోజుల క్రితం పట్టణంలోని ఓ ఇంట్లో పట్టుకు వచ్చిన ఆడ జెర్రిపోతును కళాశాల వృక్షశాస్త్రవిభాగంలో భద్రపరిచారు. శుక్రవారం రాత్రి పాము పది గుడ్లను పెట్టిందని తెలిపారు. గుడ్లను పొదిగించేందుకు సరైన పరికరాలు కళాశాలలో లేనందున హైదరాబాద్ అటవీశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీకి పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. కళాశాలలోని జీవ వైవిధ్య పరిశోధన విద్యా కేంద్రంలో ఇప్పటికే మూడు సార్లు గుడ్లను హైదరాబాద్ పంపగా అవి పిల్లలు తీశాయని ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ తెలిపారు. సాధారణంగా జెర్రిపోతు పాములు జూలై, ఆగస్టు నెలల్లో ఒక్కో పాము 6 నుంచి 22 వరకు గుడ్లు పెడతాయన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి బాలుడు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ట్రాక్టర్‌పై నుంచి కిందపడిన బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని గుడిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేందర్ తెలిపిన సమాచారం మేరకు.. గుడిపల్లికి చెందిన వసంత్ (7) తన తండ్రి పరమేష్, తల్లి భాగ్యమ్మతో కలిసి శనివారం సాయంత్రం ట్రాక్టర్‌పై పొలం వద్ద కట్టెలు తీసుకువచ్చేందుకు బయలుదేరారు. గ్రామ సమీపంలో రోడ్డుపై గుంతలు ఉండడంతో ట్రాక్టర్‌పై నుంచి వసంత్‌తో పాటు భాగ్యమ్మ కింద పడ్డారు. వసంత్ తలకు తీవ్రగాయాలు కావడంతో జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. తల్లి భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదంలో భాగ్యమ్మకు స్వల్ప గాయాలయ్యాయి.

స్మార్ట్‌ఫోన్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య


పరశురాముడు (ఫైల్)

ధరూరు: తల్లిదండ్రులు స్మార్ట్‌ఫోన్ ఇప్పించడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఖమ్మంపాడులో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గోవిందమ్మ, మునెప్ప దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో చిన్నవాడైన పరశురాముడు(20) చదువుకోలేదు. దీంతో రైతు కూలీగా పని చేసేవాడు. తన తోటి స్నేహితులతో స్మార్ట్ ఫోన్‌లు ఉన్నాయని, తనకు ఇప్పించాలని తల్లిదండ్రులను కోరాడు. ఇప్పుడు అవసరం లేదని మందలించారు. దీంతో మనస్తాపం చెంది గురువారం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు యువకుడిని గద్వాల ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శుక్రవారం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

ఇద్దరికి అవయవదానం..

తాను మరణిస్తూ మరో ఇద్దరికి ప్రాణదాతగా నిలిచాడు పరశురాముడు. తల్లిదండ్రులు ఆస్పత్రిలోనే తమ కుమారుడి అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. కళ్ల శుక్లాలను వైద్యులు సేకరించారు. అదేవిధంగా కిడ్నీల టెస్టింగ్ కోసం ల్యాబ్‌కు పంపించారు. అవయవదానానికి ముందుకు వచ్చిన కుటుంబసభ్యులను అక్కడి వైద్యులు, గ్రామస్తులు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూనే మరో పక్క అభినందించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం గౌడ్ తెలిపారు.

వ్యాధి నయం కావడంలేదని వ్యక్తి..


మక్తల్: వ్యాధి నయంకావడం వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం షిర్లక్యాతస్ చెందిన నర్సప్ప(56) నరాల వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో బాధను తట్టుకోలేక గత నెల 29న మండలంలో పంచదేవ్‌పాడు శివారులో కృష్ణానది బ్రిడ్జి పై నుంచి దూకాడు. అప్పట నుంచి అతని ఆచూకీ తెలియలేదు. శనివారం పస్పుల పుష్కర ఘాట్ వద్ద మృతదేహం లభ్యమైంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి ఆధార్‌కార్డు, చెప్పులతో గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు కృష్ణ అక్కడికి చేరుకుని తన తండ్రిగా గుర్తుపట్టారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పర్వతాలు తెలిపారు.

ప్రియుడి వేధింపులు తట్టుకోలేక వివాహిత..

బిజినేపల్లి: ప్రియుడి వేధింపులు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవునిపేటకు చెందిన మంజుల (32)కు పదేళ్ల క్రితం మండల కేంద్రానికి చెందిన సురేష్‌తో వివాహమైంది. ఈ క్రమంలో వారి ఇంటి పక్కనే ఉన్న మరో వ్యక్తి రఘురాంతో రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. ఈ విషయం భర్తకు తెలియడంతో మంజులను పుట్టినిల్లు అయిన మహదేవునిపేటలో వారి తల్లితండ్రుల ఇంట్లో వదిలిపెట్టి వచ్చాడు. ఈ క్రమంలో మంజులను ప్రియుడు రఘురాం రోజూ ఫోన్ చేస్తూ అనుమానిస్తూ, అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేయడంతో శనివారం ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రఘురాం ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన వాడని అతనిపై చర్యలు తీసుకోవాలని మంజుల కుటుంబసభ్యుడు శ్రీశైలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరేళ్లుగా ఎదురుచూపులు

- భూములు కోల్పోయి నేటికీ పరిహారం అందుకోని రైతులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



వెల్దండ మండలం అజిలాపూర్‌లో డిండి–నార్లాపూర్ ప్రాజెక్టు కాల్వ

వెల్దండ: కల్వకుర్తి నియోజకవర్గంలోని, వెల్దండ మండల పరిధిలోని అజిలాపూర్‌లో భూనిర్వాసితులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. డిండి–నార్లాపూర్ ప్రాజెక్టులో భాగంగా అజిలాపూర్‌లో కాల్వ నిర్మాణం కోసం రైతుల నుంచి భూములు తీసుకున్నారు. దాదాపుగా ఆరేళ్ల కిందట పనులు ప్రారంభించారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని అప్పట్లో హామీ ఇచ్చి ఏళ్ల గడుస్తున్నా.. నేటికి పరిహారం అందలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అనేక మార్లు రైతులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్నా.. ఫలితం లేకుండా పోయింది.

సాగుకు నోచుకోక ఇబ్బందులు..

గ్రామంలోని రైతులు కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయారు. అధికారులు సర్వే చేసి వ్యవసాయ భూముల్లో కాల్వ నిర్మాణ పనులు ప్రారంభించారు. దీంతో భూములు కోల్పోయిన రైతులు సాగుభూములు లేక అవస్థలు పడుతున్నారు. రైతులందరూ కూలీకి వెళ్తున్నారు. ఉన్న భూములు కోల్పోవడంతో పరిహారం అందక, ఇటు భూములులేక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో మొత్తం 22 మంది రైతులకు 14.13 గుంటల భూమికి రూ.1.08 కోట్ల పరిహారం రావాల్సి ఉంది. ఉన్నత అధికారులు స్పందించి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

అందని పరిహారం..



కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయాం. ఏళ్ల గడుస్తున్నా.. పరిహారం అందలేదు. వ్యవసాయ పొలాల్లో కాల్వలు తవ్వడంతో సాగుభూములు లేక ఇబ్బందులు పడుతున్నాం. భూములు కోల్పోయిన రైతులు అధికారుల చుట్టూ.. తిరుగుతున్నా.. నేటికి అందించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిహారం అందించాలి.

– సర్దార్, రైతు, అజిలాపూర్

సర్వే పూర్తిచేశాం..

అజిలాపూర్‌లో భూములు కోల్పోయిన రైతుల వివరాలు, సర్వేచేసి ఉన్నత అధికారులకు నివేదిక అందించాం. డిండి–నార్లాపూర్ ప్రాజెక్టు కాల్వలో 60.34 ఎకరాల్లో తవ్వకాలు చేపట్టారు. గతంలో 46.20 ఎకరాల భూములకు పరిహారం అందించాం. మిగిలిన 14.13గుంటల భూమికి నష్టపరిహారం రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తారు.

– అరుణ, ఇరిగేషన్, ఏఈఈ

టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి (టీటీడీ బోర్డు) చైర్మన్‌గా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నియమించారు. ప్రస్తుతం టీటీడీ చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి, ధర్మకర్తల మండలి పదవీకాలం ఈ నెల 8వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో టీటీడీ చైర్మన్‌గా భూమనను సీఎం వైఎస్ జగన్ నియమించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను దేవాదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ శనివారం జారీ చేశారు. ధర్మకర్తల మండలి సభ్యులను త్వరలో నియమిస్తామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఎం జగన్‌కు భూమన కృతజ్ఞతలు

తనను టీటీడీ చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌కు భూమన కరుణాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి అత్యంత సన్నిహితుడైన భూమన కరుణాకర్‌రెడ్డి 1958, ఏప్రిల్ 5న వైఎస్సార్ జిల్లా నందలూరు మండలం ఈదరపల్లెలో జన్మించారు. ఆయన తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ నుంచి ఎంఏ పట్టా పొందారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో 2004–06 మధ్య తుడా(తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్‌గా భూమన పనిచేశారు. ఆ తర్వాత 2006–08 మధ్య టీటీడీ బోర్డు చైర్మన్‌గా అత్యంత సమర్థవంతంగా పనిచేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హఠాన్మరణం తర్వాత వైఎస్ జగన్ వెంట భూమన నడిచారు. తిరుపతి శాసనసభ స్థానానికి 2012లో జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఘనవిజయం సాధించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి శాసనసభ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి రెండోసారి విజయం సాధించారు. సభా హక్కుల కమిటీ చైర్మన్‌గా భూమన వ్యవహరిస్తున్నారు.

చంద్రబాబు ఏ1గా కేసు నమోదు చేస్తాం: వనిత

రాజమహేంద్రవరం రూరల్: పుంగనూరులో రెచ్చగొట్టేలా మాట్లాడి విధ్వంసానికి కారకుడైన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఏ1గా కేసు నమోదు చేస్తామని ఏపీ హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ముందే నిర్ణయించిన షెడ్యూల్ రూట్‌లో వెళ్లకుండా, ఎందుకు పుంగనూరులోకి ప్రవేశించాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కల్పించాలనే కుట్రేనని అన్నారు.

పక్కా 'ఎల్లో' స్కెచ్

'పచ్చ'నేతల కనుసన్నల్లోనే పుంగనూరు విధ్వంసకాండ

- పోలీసులపై దాడికి టీడీపీ ప్రత్యేకంగా వ్యూహరచన
- ముందస్తుగా రాళ్లు, మద్యం బాటిళ్లు తరలింపు
- వాహనాలు తగులబెట్టేందుకు పెట్రోల్ బాటిళ్లు సిద్ధం
- సదుం, సోమల, పులిచెర్ల నుంచి కిరాయి మూకల రాక
- రూట్‌మ్యాప్‌ను కాదని పోలీసులతో వాగ్వాదం
- ఇద్దరు డీఎస్పీలే లక్ష్యంగా పచ్చ మూకల దాడులు
- ఇలాగైనా ప్రజల్లో గుర్తింపు పొందాలని బరితెగింపు


శుక్రవారం పోలీసు వాహనాలను ధ్వంసం చేస్తున్న టీడీపీ కిరాయి మూకలు

చిత్తూరు అర్బన్: పుంగనూరు బైపాస్ రోడ్డు వద్ద విధ్వంసకాండకు టీడీపీ రెండు రోజుల ముందే వ్యూహ రచన చేసిందా? ఇందులో భాగంగానే పలు మార్లు రూట్ మ్యాప్‌ను మార్చారా? కృష్ణదేవరాయ కూడలి వద్ద ముందుగానే రాళ్లు పోగేసుకున్నారా? సమీపంలోని పంట పొలాల్లోకి ఖాళీ మద్యం సీసాలను తీసుకొచ్చి దాచారా? ఈ ప్రశ్నలన్నింటికీ అవుననే సమాధానం వినిపిస్తోంది. ఎలాగైనా సరే అల్లర్లు సృష్టించి, రాజకీయ లబ్ది పొందాలని పన్నాగం పన్నారని స్పష్టమవుతోంది. టీడీపీ పెద్దల సూచన మేరకు కొందరు నేతలు, కార్యకర్తల కనుసన్నల్లో ఈ వ్యూహం రూపొందిందని ప్రత్యక్ష సాక్ష్యుల ద్వారా తెలుస్తోంది. ముందుగా రూపొందించిన వ్యూహం మేరకు చంద్రబాబు నాయుడు నుంచి వచ్చిన అధికారిక పర్యటన రూట్ మ్యాప్‌లో పుంగనూరు పట్టణంలో ఎలాంటి కార్యక్రమం లేదు. అయినప్పటికీ పుంగనూరు పట్టణంలోకి చంద్రబాబు రావడానికి పట్టుపట్టాలని, అందుకు పోలీసులు ఒప్పుకోరని.. అప్పుడు పోలీసులపై రాళ్లు రువ్వాలన్నది ముందస్తు వ్యూహం. ఇందులో భాగంగా ముందురోజు కొన్ని వాహనాల్లో రాళ్లను తీసుకొచ్చి కృష్ణదేవరాయల కూడలి సమీపంలో అక్కడక్కడ పోసి ఉంచారు. బార్లు, మద్యం షాపుల నుంచి ఖాళీ బీరు సీసాలు, మద్యం బాటిళ్లను తీసుకొచ్చి సమీపంలోని పొలం వద్ద దాచారు. పరిస్థితిని బట్టి ఉపయోగించాలని కొన్ని బాటిళ్లలో పెట్రోల్ నింపుకొచ్చి అక్కడ ఉంచారు. చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలికేందుకు తీసుకొచ్చిన 50కి పైగా పెద్ద సైజు పేలుడు పదార్థాల ఉండలను (బాంబుల్లాంటివి) ఓ ప్రదేశంలో దాచారు. శుక్రవారం సదుం, పులిచెర్ల, సోమల మండలాల నుంచి పలువురిని కిరాయికి తీసుకొచ్చి జన సమూహంలో కలిపేశారు. అంగళ్లలో చంద్రబాబు ఎప్పుడైతే రెచ్చగొట్టే ప్రసంగం చేస్తూ.. 'పదండి పుంగనూరుకు.. ఆ పుడింగి సంగతి తేలుద్దాం' అని పిలుపునిచ్చారో ఆ తర్వాత కూడా పలువురు టీడీపీ నేతలు మదనపల్లి నుంచి వస్తూ వస్తూ వారి వాహనాల్లో ఖాళీ మద్యం బాటిళ్లు, రాళ్లు, కర్రలు వేసుకుని వచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత స్థానిక టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు బైపాస్ రోడ్డు వద్దకు చేరుకుని, చంద్రబాబును పట్టణంలోకి అనుమతించాలని పట్టుపట్టారు. జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న ప్రతిపక్ష నేత పర్యటనను ఎలా పడితే అలా ఉన్నట్లుండి మార్చడం కుదరదని పోలీసులు చెప్పినా వినిపించుకోలేదు. దీంతో కార్యకర్తల్ని చల్లా బాబు రెచ్చగొట్టాడు.

బాటిళ్లు, చెప్పులతో దాడి

చల్లా బాబు మాటలతో రెచ్చిపోయిన కార్యకర్తలు.. ఇద్దరు డీఎస్పీలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడ్డారు. గతేడాది కుప్పంలో చంద్రబాబు నాయుడు పర్యటనలో ప్రసంగాలకు ముందస్తు అనుమతిలేదని పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, చిత్తూరు దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ బాబుప్రసాద్ నోటీసులు జారీ చేశారు. 'నాకే నోటీసులు ఇచ్చే ధైర్యమా? మీ కథ చూస్తా'అంటూ అప్పుడు చంద్రబాబు సైతం డీఎస్పీలకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరు డీఎస్పీలను లక్ష్యంగా చేసుకున్న టీడీపీ శ్రేణులు తొలుత ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, చెప్పులను పోలీసులపైకి విసిరారు. ఇది పద్ధతికాదని పోలీసు అధికారులు నచ్చజెపుతుండగానే ఒక్కసారిగా పక్కనే ఉన్న రాళ్లు విసురుతూ విరుచుకుపడ్డారు. పోలీసులు తేరుకునేలోపే టీడీపీ నేతలు తీసుకొచ్చిన కిరాయి కార్యకర్తలు వందల సంఖ్యలో రాళ్లు, మద్యం బాటిళ్ల వర్షాన్ని కురిపించారు. దీంతో పరిస్థితి అదుపుతప్పింది.

పోలీసులు బతిమాలినా వదల్లేదు

కొందరు పోలీసులు వద్దని బతిమిలాడుతుంటే వాళ్లను వ్యాను పక్కకు లాక్కెళ్లి పోలీసు లాఠీలు లాక్కుని మరీ చావ బాదారు. టపాకాయ బాంబులను పోలీసులపై విసురుతుంటే ఏం జరుగుతుందో కూడా తెలియని స్థితిలో తమను తాము కాపాడుకునే ప్రయత్నంలో చేతిలో ఉన్న ప్లాస్టిక్ గార్డులను అడ్డుగా పెట్టారు. రాళ్ల దెబ్బకు అవన్నీ ధ్వంసమయ్యాయి. అంతటితో ఆగక పోలీసుల వాహనాలపైకి టపాకాయ బాంబులు విసురుతూ.. ముందుగా తెచ్చుకున్న పెట్రోల్‌ను వాటిపై పోసి నిప్పంటించారు. రాళ్ల దెబ్బలతో రక్తమోడుతున్న పోలీసులను చూసి మానవత్వం లేకుండా దాదాపు 40 నిమిషాల పాటు ఏకధాటిగా రాళ్లు, బాటిళ్లను విసురుతూ పచ్చ మూకలు పైశాచిక ఆనందం పొందాయి.

కీలకపాత్రధారి చల్లా బాబు

మీడియాతో డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ రిషాంత్

పుంగనూరులో జరిగిన అల్లర్లు, పోలీసులపై దాడులు మొత్తం ముందస్తు ప్లాన్ ప్రకారం జరిగినవేనని రాయలసీమ డీఐజీ అమ్మిరెడ్డి, చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం చిత్తూరులోని పోలీసు అతిథి గృహంలో వారు మీడియాతో మాట్లాడారు. పుంగనూరులో టీడీపీ మూకలు పోలీసులపై ఎలా దాడులకు పాల్పడ్డాయో వీడియో ద్వారా చూపించారు. కొన్నిచోట్ల పోలీసులు బతిమాలుతున్నా వినిపించుకోకుండా, వాళ్ల లాఠీలు లాక్కుని పోలీసుల్నే కొట్టారని చెప్పారు. వాహనాలపైకి టపాకాయ బాంబులు వేయడంతోపాటు, పెట్రోల్ పోసి నిప్పంటించారని చెప్పారు. అసలు చంద్రబాబు నాయుడు ఇచ్చిన షెడ్యూల్ మేరకు పుంగనూరు పట్టణంలో ఆయన పర్యటనే లేదని, స్థానిక టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు ఉద్దేశ పూర్వకంగా ప్లాన్ చేసి గొడవలు సృష్టించారన్నారు. బాబును పుంగనూరులోకి అనుమతించాలని పార్టీ శ్రేణులను రెచ్చగొట్టి పోలీసులపై దాడులు చేయించారని చెప్పారు. ప్రజల ప్రాణ, మాన, ఆస్తులను కాపాడడమే లక్ష్యంగా పోలీసులు ధైర్యంగా నిలబడి అల్లరి మూకలు పుంగనూరులోకి ప్రవేశించకుండా అడ్డుగా నిలబడ్డారని తెలిపారు. దెబ్బలు తగిలి రక్తం కారుతున్న వేళ, పోలీసుల వద్ద ఆయుధాలు ఉన్నప్పటికీ సంయమనం పాటించారన్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పోలీసులు విధులు నిర్వర్తించి ధైర్య సాహసాలు ప్రదర్శించారని ప్రశంసించారు. ఈ దాడుల్లో పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు కీలక పాత్రధారిగా కేసు నమోదు చేశామన్నారు. విధుల్లో ఉన్న పోలీసులను చంపాలని చూడడం, పోలీసు వాహనాలు ధ్వంసం చేయడం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని చెప్పారు. ప్రస్తుతం 40 మందిని అరెస్టు చేశామని, మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

చివరకు చిల్లర గొడవలే దిక్కా!?

ముందస్తు మేనిఫెస్టో, లోకేశ్ పాదయాత్ర.. ఇలా ఎన్ని ప్రయత్నాలు చేసినా టీడీపీ తేరుకునే అవకాశాలు లేకపోవడంతో చంద్రబాబు చివరకు తనకు అలవాటైన ఘర్షణలనే నమ్ముకున్నారని పుంగనూరు ఘటన స్పష్టం చేస్తోంది. ప్రజాదరణ లేదని తేలిపోవడంతో రోడ్‌షోలతో వీధి గొడవలకు దిగుతున్నారు. ప్రాజెక్టుల సందర్శన ముసుగులో పర్యటిస్తున్న చంద్రబాబు అసలు ఆ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అంతిమ లక్ష్యం రెచ్చగొట్టి ఘర్షణలకు పురిగొల్పడమేనని స్పష్టమవుతోంది. తన పర్యటనలను యుద్ధభేరిగా మార్చుకోవటాన్ని బట్టే వాస్తవాలు బహిర్గతమవుతున్నాయి. ఇందులో భాగంగానే రాయలసీమలో గొడవలు సృష్టించేందుకు ఒక పథకం ప్రకారం చంద్రబాబు పర్యటనల ద్వారా డిజైన్ చేసినట్లు స్పష్టమవుతోంది. తొలుత పులివెందులలో కూడా ఇలానే రెచ్చగొట్టి గొడవ సృష్టించడానికి విఫలయత్నం చేయడం తెలిసిందే. వాస్తవానికి పులివెందులలో టీడీపీకి దిక్కులేదు. అందుకే కిరాయి జనంతో రోడ్‌షో నిర్వహించి హడావుడి చేశారు. అనుకున్న లక్ష్యం నెరవేరక పుంగనూరుపై దృష్టి సారించి, గొడవ సృష్టించడంలో సఫలమయ్యారు.

'ఈనాడు' నైజం బట్టబయలు

వైఎస్సార్‌సీపీ నాయకుడికి టీడీపీ ముసుగేసిన వైనం



కురబలకోట: చంద్రబాబు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో చోటుచేసుకున్న గొడవలో శుక్రవారం కురబలకోట మండలంలోని అంగళ్లకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అర్జున్‌రెడ్డి టీడీపీ దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. అయితే శనివారం ఈనాడు దినపత్రిక పతాక శీర్షికలో అర్జున్ రెడ్డిని టీడీపీ కార్యకర్తగా పేర్కొంటూ ఫొటో ప్రచురించింది. రక్తమోడుతున్న టీడీపీ కార్యకర్త అని ప్రచారం చేసింది. దాడిలో దెబ్బలు తిన్నది వైఎస్సార్‌సీపీ నాయకుడైతే నిస్సిగ్గుగా టీడీపీ కార్యకర్త అని దుష్ప్రచారం చేయడం ఈనాడు రామోజీకే చెల్లిందని అంగళ్లు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై బాధితుడు అర్జున్ రెడ్డి మాట్లాడుతూ తనను టీడీపీ కార్యకర్తగా ప్రచురించడం ఈనాడు తన 'పచ్చ'పాతాన్ని చాటుకుందన్నారు. తాను తొలి నుండి వైఎస్సార్‌సీపీ వీరాభిమానినన్నారు. కాగా, శనివారం అర్జున్‌రెడ్డిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

కఠిన చర్యలు తప్పవు: డీజీపీ

సాక్షి, అమరావతి: పుంగనూరు ఘటనపై విచారణకు ఆదేశించామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారందరిపై కఠిన చర్యలు తప్పవని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. ఘటన పూర్వాపరాలపై విచారణ జరపాలని డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ రిషాంత్‌లను ఆదేశించామన్నారు. ఈ విషయమై శనివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. చంద్రబాబు పర్యటన సందర్భంగా టీడీపీ కార్యకర్తలు చేసిన దాడిలో పోలీసులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. అక్కడ వాహనాలను సైతం టీడీపీ కార్యకర్తలు ఉద్దేశపూర్వకంగా తగులబెట్టారని చెప్పారు. రాళ్లు రువ్విన, నిప్పు పెట్టిన వారందరినీ గుర్తించామన్నారు. ఘటన స్థలిలో సీసీ కెమెరా ఫుటేజీలను విశ్లేషిస్తున్నామని, ఇప్పటికే పలువురిని గుర్తించామని.. మరికొందరు అనుమానితుల కదలికలపై నిఘా పెట్టామని తెలిపారు. చంద్రబాబు రూట్ ప్లాన్ మార్పు వ్యవహారం కూడా విచారణలో తేలుతుందన్నారు. చంద్రబాబు చేసిన రెచ్చగొట్టే ప్రసంగాలపై కూడా దృష్టి పెట్టామని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే సహించేది లేదని పునరుద్ఘాటించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ పనుల పరిశీలన



దేవరకద్ర రూరల్: స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్ పనుల పరిశీలనలో భాగంగా శనివారం కౌకుంట్ల మండల కేంద్రంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు, బహిరంగ ప్రదేశాలను కేంద్ర గ్రామీణ్ అధికారి నాగశైని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని వార్డులలో తిరిగి పరిశుభ్రత కోసం చేపడుతున్న చర్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల పరిశీలన అనంతరం ఉన్నతాధికారులకు పంపించే నివేదిక ద్వారా కేంద్రం, రాష్ట్రంలో ఉత్తమ గ్రామ పురస్కారాలకు పంచాయతీలు ఎంపిక అవుతాయని తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ స్వప్న, నాయకులు ఉన్నారు.

అప్రెంటిషిప్ మేళాకు 326 మంది ఎంపిక



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన అప్రెంటిషిప్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ వృత్తి విద్య కోర్సులు చేసిన విద్యార్థులు 1,100 మంది హాజరైనట్లు డీఐఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. హాజరైన వారిలో 326 మంది పలు సంస్థల్లో అప్రెంటిషిప్ కోసం ఎంపికయ్యారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్మీడియట్ బోర్డు ఇన్‌చార్జ్ జ్యోత్స్నరాణి హాజరై మాట్లాడారు. వృత్తి విద్య పూర్తిచేసిన వారికి అప్రెంటిషిప్ మేళా ఒక వరం లాంటిదని, విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బోర్డు అధికారి విజయ్‌కుమార్, మేళా కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ భగవంతచారి, అధ్యాపకులు, మైమూద్, మదన్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి శఠగోపం!


జడ్చర్ల-మహబూబ్‌నగర్ రోడ్డులో ఏర్పాటు చేసిన మార్బుల్, గ్రానైట్ వ్యాపారాలు

- బడా వ్యాపారులు.. భారీగా పన్నుల ఎగవేత
- రూ.కోట్లల్లో మున్సిపల్ ఆదాయానికి గండి
- సామన్యుల నుంచి ముక్కుపిండి పన్నుల వసూలు
- చోద్యంచూస్తున్న అధికారులు, పాలకులు

జడ్చర్ల: జడ్చర్ల మున్సిపాలిటీకి పన్నులు చెల్లించకుండా వ్యాపారులు భారీగా శఠగోపం పెట్టారు. ప్రధాన వాణిజ్య, వ్యాపార కేంద్రంగా దినదినాభివృద్ధి చెందుతున్న జడ్చర్ల పట్టణంలో బడా వ్యాపారులు పన్నులను భారీగా ఎగవేస్తున్నారు. నిత్యం లక్షల్లో వ్యాపారం సాగిస్తున్న వీరు మున్సిపల్ శాఖకు చెల్లించాల్సిన పన్నులను ఎంతమాత్రం కట్టకుండా మొండి కేస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోకుండా తమ వ్యాపారాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. మున్సిపల్ శాఖకు ప్రధాన ఆదాయ వనరులుగా ఉన్న వ్యాపారవర్గాలు చిల్లిగవ్వ కట్టకుండా తమ దందాను దర్జాగా కొనసాగిస్తున్నా పన్నులు వసూలు చేయాల్సిన మున్సిపల్ శాఖ అధికారులు మాత్రం అటు వైపు కన్నెత్తి చూడడంలేదు. సామాన్యుల నుంచి ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది వ్యాపారుల నుంచి ఎందుకు పన్ను వసూలు చేయడం లేదన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది.

ఎందుకీ ఉదాసీనత?..

వ్యాపారులతో అధికారులు, పాలకులు కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. అందుకనే వారికి కనీసంగా ట్రేడ్ లైసెన్స్‌లు ఇచ్చే ధైర్యం చేయడంలేదు. కనీసంగా నోటీసులు కూడా జారీ చేయడం లేదంటే పరిస్థితిని ఊహించవచ్చు. అప్పుడో ఇప్పుడో వారి జన్మదిన, తదితర వేడుకల సందర్భంగా ఫ్లెక్సీలు, తదితర ఏర్పాట్లకు కొంత సహాయం చేసి కొందరు వ్యాపారులు స్వామిభక్తిని చాటుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకనే పాలకులు వారిని వెనకేసుకొస్తూ, మున్సిపల్ శాఖకు రావాల్సిన ఆదాయం వసూళ్లకు అడ్డు తగులుతున్నట్లు సమాచారం. ఇక అధికారులు సైతం అంతో ఇంతో పుచ్చుకుని ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

అనుమతులే లేవు..

జడ్చర్ల పట్టణ పరిధిలో ఏర్పాటవుతున్న వ్యాపార, వాణిజ్య కేంద్రాలకు మున్సిపల్ శాఖ నుంచి అసలు ఎలాంటి అనుమతులు తీసుకోవడం లేదు. అటు 44వ నంబర్ జాతీయ రహదారితో పాటు ఇటు 167వ నంబర్ జాతీయ రహదారి, తదితర ప్రధాన రహదారులను అనుసరించి హోటళ్లు, దాబాలు, ఆస్పత్రులు, లాడ్జీలు, మార్బుల్, గ్రానైట్, టైల్స్, ప్లంబర్, స్టీల్, సిమెంట్, తదితర అనేక వ్యాపార కేంద్రాలకు సంబంధించిన నిర్మాణాలు వెలిశాయి. కానీ ఆయా నిర్మాణాలకు సంబంధించి అనుమతులే తీసుకోవడం లేదు. కనీసం 200 చ.గ నుంచి 1500 చ.గ వరకు భారీ షెడ్‌లు నిర్మించారు. అయితే తాత్కాలిక షెడ్‌ల పేరుతో నిర్మాణ అనుమతులను నిరాకరిస్తున్నారు. నిబంధనలను పట్టించుకోవడం లేదు. అంతేగాక ఆయా నిర్మాణాలకు సంబంధించి రక్షణ చర్యలను కూడా విస్మరిస్తున్నారు. తమ ఇష్టానుసారంగా నిర్మాణాలను చేపట్టి వాటిలో తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నా సంబంధిత అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారే తప్ప చర్యలకు దిగడం లేదు.

ఐదేళ్లుగా ఆ హోటల్‌కు లైసెన్స్ లేదు..

జడ్చర్ల కొత్త బస్టాండ్ సమీపంలో జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిని అనుసరించి దాదాపు 700 చ.గల విస్తీర్ణంలో కొనసాగుతున్న ఓ ప్రముఖ హోటల్‌కు ఎటువంటి అనుమతులు లేవు. దాదాపు ఐదేళ్లకు పైగా ఈ హోటల్ ఇక్కడ కొనసాగుతున్నా చిల్లిగవ్వ పన్ను చెల్లించలేదు. గత ఏడాది ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలంటూ మున్సిపల్ శాఖ అధికారులు నోటీసు జారీ చేసినా ఖాతరు చేయలేదు. ఈ విషయంపై 'సాక్షి' సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మళ్లీ నోటీసు జారీ చేస్తామని సంబంధిత అధికారి నగేశ్ తెలిపారు.

సామాన్యులతో మాత్రం వసూలు..

మున్సిపాలిటీ పరిధిలో గృహ సముదాయాలలో నివాసం ఉంటున్న వారి నుంచి మాత్రం మున్సిపల్ అధికారులు పన్నులను ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ఒక్కో ఇంటికి పలుసార్లు వచ్చి ఒత్తిడి తెచ్చి పన్ను వసూలు చేస్తున్నారు. కానీ బడా వ్యాపారుల వద్ద ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రూ.కోట్లల్లో కుచ్చుటోపీ..

ప్రతి ఏడాది వ్యాపారుల నుంచి ఆదాయం లభించకపోవడంతో మున్సిపల్ శాఖ ఏటా రూ.2కోట్లపైనే నష్టపోతోంది. వ్యాపారులు ఎలాంటి పన్ను చెల్లించకుండా, లైసెన్స్‌లు సైతం తీసుకోకుండా మున్సిపల్ శాఖకు కుచ్చుటోపీ పెడుతున్నారు. ప్రధానంగా భారీ కమర్షియల్ కాంప్లెక్స్‌లలో కొనసాగుతున్న సూపర్ మార్కెట్‌లు, ఎంటర్‌ప్రైజెస్‌లు, వస్త్ర దుకాణాలు, హోటళ్లు, మార్బుల్, టైల్స్, సిమెంట్, స్టీల్, ఆస్పత్రులు తదితర భారీ వ్యాపార వాణిజ్య కేంద్రాలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి పన్నులు చెల్లించకుండా వ్యవహరిస్తున్నాయి.

ఇదెక్కడి న్యాయం..



సామన్య ప్రజల నుంచి నిక్కచ్చిగా పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు, వ్యాపారుల నుంచి ఎందుకు వసూలు చేయడం లేదు. ప్రతి సంవత్సరం రూ.కోట్ల ఆదాయం కోల్పోతూ, వ్యాపారుల కొమ్ము కాయడంలో ఆంతర్యం అర్థం కావడం లేదు. పెద్దలకో న్యాయం.. పేదలకో న్యాయమా? ఇప్పటికైనా పన్నుల ఎగవేతదారులకు భారీ జరిమానా విధించి వసూలు చేయాలి. – శ్రీకాంత్, జడ్చర్ల

మళ్లీ నోటీసులు ఇస్తాం..



మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారం చేస్తున్న వారు విధిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాల్సి ఉంటుంది. వీరికి గతంలో నోటీసులు జారీ చేసినా వారి నుంచి జవాబురాలేదు. మరోసారి నోటీసులు జారీ చేసి పన్ను వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటాము. – గణేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మున్సిపాలిటీ, జడ్చర్ల

చర్యలు తీసుకుంటాం



పట్టణంలో కొన్ని వ్యాపార కేంద్రాలకు సంబంధించి అనుమతులు లేవు. ట్రేడ్ లైసెన్స్‌ల కోసం వారు దరఖాస్తులు చేసుకోలేదు. ఇందుకు సంబంధించి నోటీసులు జారీ చేసి పన్నులు వసూలు చేసేలా చర్యలు తీసుకుంటాము. నిబంధనల మేరకు జరిమానాలు విధించి పన్నులు వసూలు చేస్తాము. – మహ్మద్‌షేక్, కమిషనర్, మున్సిపాలిటీ, జడ్చర్ల

పాలమూరు రైల్వేస్టేషన్‌కు..

అత్యాధునిక హంగులు


మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

- అమృత్ భారత్‌స్టేషన్ పథకం కింద రూ.39.9 కోట్లు మంజూరు
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్రమోదీ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. 'అమృత్ భారత్ స్టేషన్ పథకం' ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, గద్వాల, జడ్చర్ల, షాద్‌నగర్, శ్రీబాలబ్రహ్మేశ్వర జోగులాంబ స్టేషన్లను ఎంపిక చేశారు. మొదటి విడతలో రాష్ట్రంలోని 21 స్టేషన్లను ఈ పథకం కింద అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. మొదటి విడత స్టేషన్లలో మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌కు స్థానం దక్కింది. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రధాన నరేంద్రమోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. ఇందుకు సంబంధించి అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక వేదిక, శంకుస్థాపన శిలాఫలకంతోపాటు ప్రధానమంత్రి వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేసే కార్యక్రమాన్ని తిలకించడానికి స్క్రీన్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

మహబూబ్‌నగర్‌కు రూ.39.9 కోట్లు

ఉమ్మడి జిల్లాలోనే మహబూబ్‌నగర్ స్టేషన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.39.9 కోట్లు కేటాయించారు. ఏబీఎస్ఎస్ కింద స్టేషన్‌లో ఆధునీకీకరణ పనులు చేపట్టనున్నారు. ముఖద్వారాలు, పార్కింగ్, లైటింగ్ సౌకర్యాలతోపాటు స్టేషన్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. అదేవిధంగా స్టేషన్‌లో మరో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేయనున్నారు.

వానరాన్ని కాపాడిన యువకులు


కృష్ణానది మధ్యలో పిల్లర్‌పై ఉన్న వానరం


వానరాన్ని కాపాడిన సొసైటీ సభ్యులు

పెంట్లవెల్లి: కృష్ణానదిలో మధ్యలో హైటెన్షన్ పిల్లర్‌పై వానరం చిక్కుకుంది. రెండేళ్ల నుంచి చుట్టు పక్కల గ్రామస్తులే వానరానికి పండ్లు, ఆహారం అందిస్తున్నారు. వానరాన్ని మండలంలోని మంచాలకట్ట యువకులు కాపాడేందుకు ఎన్నోసార్లు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఫొటోలు తీసి సోషల్ మీడియాలో షేర్ చేయగా హైదరాబాద్ పటాన్‌చెరువుకు చెందిన ఎనిమల్ వారియర్ సొసైటీ వారు మంచాలకట్టకు శనివారం చేరుకున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ప్రయత్నించి వానరాన్ని ఒడ్డుకు చేర్చారు. ఆ యువకబృందానికి స్థానికులు అభినందనలు తెలిపారు.

పోస్టాఫీస్‌లలో జాతీయ జెండాల విక్రయం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఘర్ ఘర్ తిరంగాలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖ ద్వారా రూ.25కే జాతీయ జెండాను విక్రయిస్తున్నట్లు మహబూబ్‌నగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.నంద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ జెండాల విక్రయం కోసం మహబూబ్‌నగర్ పోస్టాఫీస్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా సబ్ పోస్టాఫీస్, బ్రాంచి పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. epostoffice.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో జాతీయ జెండాను బుకింగ్ చేసుకుంటే ఇంటి వద్దకే అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.